# టెలీపతి

టి. షణ్ముఖరావు



మనిషి-ఆలోచించే స్వేచ్ఛనీ, కలలు గనే హక్కునీ పోగొట్టుకున్నా, ఆత్మహత్యలు చేసుకున్నా ఒకరి కొకరు రంపాలతో కోసుకున్నా ఆ నేరం అమితంగా పెరుగుతున్న విజ్ఞానానిదే కావడం అతి విషాదకరం.

ఉదాహరణకి ఈ మధ్య టెలిపతీలో సాధించిన ఘన విజయం (ఒక వార్త ఆధారంగా) ప్రభావం ఇలా చిత్రించుకోవచ్చు.

## 1

"ఒరే వెంకన్నా!"

"బాబూ!" (ఏరా! భుజంగరావూ!)

'మన సిరిపురం తోటలో...'

'సిత్తం...' (మన? తోటలో నాకూ వాటా ఇస్తావా?)


'అరటిచెట్లు బాగా పెరుగుతున్నాయా?'

'పెరుగుతున్నాయి, బాబూ!' (నేనే పెరగడం లేదు రా!)

'మన బొచ్చు కుక్కకి బిస్కట్లు పట్రారా!'

'అలాగే, బాబూ!' (ఈ పాతికేళ్ళ నౌకరీలో కనీసం కుక్క కెట్టిన బిస్కత్తు లాంటిది నాకు... ఒక్కసారైనా తినమన్నావా?)

'కుక్క బాగా తయారయింది కదరా!'




'తమ పోనసలో అవకేటే సెత్నాది. బాబూ!' (నా కన్నా అదే ఎయ్యిరెట్లు నయం..)

'డ్రైవరుకు కారు రెడీ చెయ్యమం జెప్పు.'

'సెప్తాను, బాబూ!' (దార్లో సాసి లెంపకాయ కొట్టీసి ఆ కార్లో నాకే ఎల్లాలని ఉన్నాదిరా. నన్నాసీ!)

××× ××

'వెంకన్నా!' (నీ లాంటి బికారి వెధవకి అలాటి అందమైన కూతురు ఎలా పుట్టిందిరా, వెధవా?)

'బాబూ!'

'నీ కూతురికి సంబంధా లొస్తున్నాయిరా...' (దాన్ని కట్టుకొనే అదృష్టవంతు డెవడో?)

'వస్తన్నాయి గానీ! ఎల్లనంటుంది, బాబూ!'

'ఎందు కెళ్ళదు?' (దానికీ పెద్ద కోరికలే వుండుంటాయి. సిరిపురంలో బంగళా కట్టించి దాన్ని నేనే ఉంచేస్తే బాగుణ్ణు. వెధవని. అడిగితే ఏమనుకుంటాడో? లోకం ఎలా భావించు కుంటుందో? పోనీ ఒక్కటంటే ఒక్కసారి...)

'దానికి దాని బావమీద దృష్టి ఉన్నది. బాబూ!'

'అయితే మరింకేం?' (ఆ కోతి వెధవకీ దానికీ. పెళ్ళేమిటి? అది పట్టుపరుపులమీద తిరగాలి...)

'ఆడు పట్నంలో ఉన్నాడు, బాబూ! వొస్తానసడమే గానీ రావడం లేదు, బాబూ!'

'రమ్మని గట్టిగా ఉత్తరం రాయించు' (వాడు చచ్చినా పీడా పోయేది...)

'రాయాలి, బాబూ!'

## 2

'ఒ సేప్ సితా! సితా డియ్యర్!' (శనిగొట్టు పీనుగా!)

'వస్తన్నానండీ'

'త్వరగా' (పిలవగానే ఎప్పుడొచ్చి సచ్చావు గనక)

'మీరే రండి.'

'ఇక్కడ్నించి బదిలీ అయింది...' (నిన్ను కట్టుకున్నాను నా బతుక్కి బదిలీలే. ప్రొమోషన్లెక్కడివి. జూనియర్‌గా రిటైరవలసిందే. ఆ దయానందంగాడి పెళ్ళాం చూడు. ఎంచక్కా ఆఫీసర్లని మంచి చేసుకొని. దొంతర్లుగా ప్రమోషన్లు.)

'ఎక్కడికండీ?'

('అమలాపురం' వల్లకాట్లోకి. ఈ జూనియర్ హోదాతో అమెరికా అయినా వొక్కటే...)

'బావుంటుంది కదండీ!'

'చాలా బావుంటుంది. ఎంచక్కా కోనసీమలో తిరగొచ్చు!' (నీ మొహం కాల్చినట్టే ఉంటుంది. నీతో స్వర్గానికెళ్ళి నా బతుకింతే...)

'అక్కడ రాబడీ...'

'బ్రహ్మాండం...' (నేను లంచాలు తిని. అడ్డమైన గడ్డీ కరిచి కాళ్ళూ పట్టుకొని. తిట్లు కాసి సొమ్ము తెస్తే నువ్వూ, నీ పిల్లలు గాది కింద ఎలకల్లా తింటున్నారు.)

'అయితే ఇందండీ స్వీటు.'

'నీ చేత్తోనే నోట్లో పెట్టెయ్యి, డియర్' (ఛీ. పొగ కంపు కొడుతున్నావు. మా ఆఫీసులో టైపిస్టు శూర్పణఖ ఎంత ముచ్చటగా ఉంటుందో. పరిమళాలు వెదజల్లుతుంది. పెళ్ళామంటే అలాంటిది పెళ్ళాం గానీ. ప్రతి ఆడదీ పెళ్ళామే?...)

'ఈ చీర బాగుందాండీ. వీధిలో కొస్తే కొన్నాను...'

'అద్భుతంగా ఉన్నావు. సితా డియర్!' (ఏడిసినట్టున్నావు)

'ఎల్లుండి మన మేరేజ్ డే. గుర్తుందా?'

'గుర్తు లేకేం... ప్రోగ్రామ్ నిర్ణయించు.' (మరిచేపోయాను. పది మేరేజ్ డే లయిన్నాయి. ప్రతి మేరేజ్ డేకీ ఒకే మొఖం. అందులోనూ నీది కాకుండా వేరే వేరే... ఈ బతుక్కి అంత అదృష్టం ఎక్కడిది...)

××× ×

'ఏవండీ' (ఒరే రామ్మూర్తీ! చవట నన్నాసి!)

'డియర్!'

'ఈ పండక్కి పట్టుచీర కొందామండీ!' (డియర్ ట... బొయ్యర్. నీ మొహానికి సాదా చీర కూడా కొనడం లేదు. సొమ్మంతా పేకాటకీ, సిగరెట్లకీ తగలేస్తున్నావు. పుట్టింటివారు గట్టివారు కనక సరిపోతోంది)

'తప్పకుండానూ!'

"సాయంత్రం త్వరగా రండి, సినిమాకెళ్దాం." (చేసింది ఏ వెధవ ఉద్యోగమో తెలీదు. పొద్దుటనగా పోయి జామురాత్రికి రావడం. అలసి పడుకోవడం. గుమస్తా మొగుడొద్దని మా నాన్నతో చెబితే విన్నాడు కాదు. పొరుగింటి సుందర్రావు మేస్త్రు చూడు—అయిదయే సరికల్లా పువ్వులు పట్టుకొని పెళ్ళాం ఒళ్ళో వాల్తాడు.)

'ఇవాళ ఇన్‌స్పెక్షనుండొచ్చు, డియర్!'

'పోనీలేండి...' (నీ ప్రయోజకత్వం నాకు తెలుసు ఓ ముద్దూ ముచ్చటా లేదు. ఎదురింటి ఏకాంబరం దంపతులు... పెళ్ళయి ఇరవైయ్యేళ్ళయినా... రెండ్రోజుల కో సినిమా నెల కో టూరు. ఆవిడ మొగుడ్ని కొంగుకు కట్టుకు దిరుగుతుంది.)

'వొస్తాను, సితా! దార్లో సైకిలు రిపేరు చెయించాలి.'

'వెళ్ళి రండి.' (ఓ సైకిలు ముక్క కొనుక్కోవడానికీ దిక్కు లేదు. సదానందంగారు స్కూటరు కొంటున్నారట. ఆవిడ కిందకి చూడ్డం లేదు.)

'తలు పేసుకో.'

'అలాగే లెండి.' (వేసుకుంటాను. ఎవడూ నా మీద పడిపోవడం లేదు. ఎదురింట్లో దిగిన స్టూడెంటు కుర్రాడు ఎంత ముచ్చటగా ఉన్నాడో?...)

## 3

'ఓటరు మహాశయులారా!' (క్రిందటిసారి నా డిపాజిట్ పోగొట్టిన అడ్డగాడిదల్లారా!)

రాజశేఖరంగారిని మీకు పరిచయం చెయ్యఖ్ఖర లేదు. (ఇంత నీచుణ్ణి మీ రెలా మరిచిపోగలరు?) వీరి గుణగుణాలు నా కన్నా మీకే బాగా తెలును. అనుభవజ్ఞుడు. రాజకీయ దురంధరుడు. ఉత్తముడు. దయాశీలి. దానకర్ణుడు. (సంతకం రాని చవట. జిత్తులమారి నక్క. దుర్మార్గుడు. దయావిహీనుడు. పిసినారి పీడ. తాగుబోతు. ఖూనీకోరు. లుచ్ఛా.) ఈసారి వీరికి పార్టీ టికెట్టు ఇవ్వడం మనందరి అదృష్టం. (కిందటిసారి మీరే గడ్డి తిని వీణ్ణి గెలిపించారు. పోనీ అని ఆ పార్టీలో చేరాను. ఈసారి అధిష్ఠానవర్గం గడ్డితిని వీడికే టిక్కెట్టిచ్చారు. నన్ను మోసం చేశారు. అనుభవిస్తారు.) వీరే గెలిచి మళ్ళీ ప్రజా సేవ చెయ్యాలి. (తప్పకుండా ఓడిపోయి మట్టి కరిచెయ్యాలి.)

'కాబట్టి మీ అమూల్యమైన ఓటు వీరికే వేయులి.' (వీడి దగ్గర డబ్బు గుంజెయ్యాలి. అవతల వాడ్ని గెలిపించాలి.)

××× ××

'మహాజనుల్లారా!' (వెఱ్ఱివెంగళాయిల్లారా!)

'గత సారి నన్ను గెలిపించినందుకు కృతజ్ఞుణ్ణి' (తేరగా. ఓటుకి అయిదు రూపాయలు తీసుకున్నరు. సారా తాగారు. ఎవడి తాతగారి సొమ్మనుకున్నారు?...) 'మీ వాడ్ని. మీలో వాడ్ని... మీ కోసం ఏమైనా చేస్తాను.' (నాకు ఊరికే ఓట్లే సేరా? ఏదైనా కావాలని రండి. చెప్పుచ్చుక్కొడతాను.) 'మళ్ళీ ఎన్నిక లొచ్చాయి.' (ఒకసారి గెల్చినవాడు జీవితాంతం పదవిలో ఉండకుండా. మధ్య మధ్య ఎన్నికలొకటి మమ్మల్ని చంపడానికి.) 'ఈ సారికూడా దయతో నన్నే గెలిపించాలి...' (నేనే మీ చేత ఓట్లేయించుకుంటాను. ఆ దోసు పోలింగు తేదీ ముందు రాత్రి మాత్రమే. ఇప్పుడైతే మరిచిపోతారు మీరు... కృతఘ్నులు.)

××× ××

'ఒరే జంగాలూ! ఈ సారి మన పేట్లో వోట్లన్నీ మనకే పడాల్రా!

'అదేటి. బాబూ. అది మా యిది.' (మల్లీ

**23-1-85**

ఎల్లచ్చుణ్ణొచ్చిందాకా కనపడ్నె దవకి ఓట్లెందు కెయ్యా లంట?...)

'శంఖులింగంగారూ...మీరూ సహకరించాలి.'


'ఎంత మాట...' (నా కొడుక్కి కాలేజి సీటుకోసం వొ స్తే కన్నెత్తి చూడ్లేదు. చచ్చినా, నీకు ఓట్లు పడనివ్వను కాక పడనివ్వను.)

'బాబూ రాజారాం! మీ యువజన సంఘం కుఱ్ఱాళ్ళంతా సాయం చెయ్యాలోయ్.'

'తప్పకుండానూ.' (నీలాంటి స్వార్థపరుడికి తప్ప ఇంకెవడికైనా సాయం చేస్తాం...)

'పీర్ల సాయిబుగారూ! మీ ఓట్లు మాకే పడాలి సుమండీ!'

'ఆ సంగతి మీరు చెప్పాలా!' (మీరు ఓడిపోయేట్లు చూడ్డం నా ధర్మం. క్రితం మున్సిపల్ ఎన్నికల్లో నా అపోజిషనోడిని గెలిపించావు. ఈసారి నీకు ఎసరు పెట్టకపోతే నా పేరు పీర్ల సాయిబు కానే కాదు.)




## 4

'నమస్తే. మస్టారూ!' (నమస్తే రా! గుఱ్ఱంమొహంగా!)

'ఏవోయ్! నిన్నటి నోట్సు కంఠస్థం చేశావా?'

'నిన్న ఒంట్లో బాగులేదు. మస్టారూ! రేపటికి తప్పకుండా అప్పచెబుతాను.' (రాత్రి కస్తూరితో సినిమా కెళ్ళాన్రా! చదువేల చంక నాకను...)

'నిన్నటి పాఠం జాగ్రత్తగా విన్నావా?'

'విన్నానండీ!' (-నువ్వు మగపిల్లలవైపు తల తిప్పకుండానే-ఫ్రంటు బెంచీలోని ఆడపిల్లల మొహాలమీద ఉమ్మేస్తున్నావు. నీ క్లాసెం తరవాత మొహాలు కడుక్కోవడానికి ఉమ్మడిగా ఖరీదైన సబ్బు కొనుక్కున్నారు.)

'అర్థమయిందా?'

'మీరు చెప్పాక అర్థం కాక ఏమవుతుందండీ?' (నీ కొకటి వచ్చి చస్తే కదా మాకు అర్థమయినట్టు. ఏడవడానికి? అసలు పుస్తకం తియ్యడానికే నీకు టైమ్ ఉండదు. వైద్యం. వ్యాపారం. జ్యోతిషం. వ్యవసాయం. పద్దులూ. పత్రాలూ...)

'నా కీ మధ్య బదిలీ కావచ్చునోయ్.'

'మేం చచ్చిపోతాం సుమండీ.' (సంతోషంరా, గుఱ్ఱంమొహంగా. పరమసంతోషం. మేమే నిన్ను ఖూనీ చేస్తే కాని చదువు ప్రావనుకుంటున్నాం. చదువు చెప్పాలేవు. కాపీలు కొట్టానివ్వవు. ఛస్తాం?)

## 5

'ఏఁవోయ్ వీరన్నా!'

'సార్!' (ఏం రా...ఆఫీసరూ.)

'కూరగాయలు ఇంటి కిచ్చావా?'

'ఇచ్చాను. సార్.' (అంతేకాదు. ఇల్లు తుడిచాను. పిల్ల చీమిడి తీశాను. కడిగాను. ఏ జన్మలో నువ్వు నా చాకిరీ చేశావో? ఇప్పుడు నే న్నీకు...)

'అమ్మగారు ఏమన్నారు?'

'చాలన్నారండీ' (అమ్మగారు బాత్‌రూమ్‌లోంచి వస్తుంటే చూశాను. ఎన్నో కోరికలు పుట్టాయి. ప్చ్. లంచాల సొమ్ము తిని తెగ నిగనిగ లాడుతున్నా ర్రా మీ రంతా.)

'రెండు కాఫీలు పట్రావోయ్.'

'అలాగే, సార్.' (ఎవడైనా వస్తున్నాడంటే నరిసన్నవతలికి పంపేసి పట్టిగ్గా పుచ్చేసుకుంటావు. నిన్ను ఖూనీ చేసి రెండంటే రెండే రోజులు నీ కుర్చీమీద కూర్చొని నాలుగు చేతులా ఆర్జించి, అప్పులన్నీ తీర్చుకోవాలని ఉంది...)

×× ×× ××

'డైజీ!' (డియర్...డియర్ డైజీ)

'సార్!'

'రా... కూర్చో.' (ఇలా నా వొడిలో కూర్చో. ముసలాడినైనా ముద్దు పెట్టుకుంటాను.)

'ఎస్సర్!'

'నిన్నటి కంపెనీకి జవాబు రాయాలి. డిక్టేట్ చేస్తాను. రాసుకో.' (వెధవ కంపెనీ. నువ్వేం రాయనక్కరలేదు. ఎదురుగా కూర్చో చాలు. నిన్ను చూస్తూ యుగాలు గడపాలని ఉంటుంది...)

'ఎస్సర్!'

'నిన్ను చూస్తుంటే మాతమ్ముడుగారి అమ్మాయి గుర్తొస్తూంది.' (ఆపిల్ పళ్ళూ, గులాబిలూ, కుషన్ బెడ్లూ, బ్లూ సినిమాలూ గుర్తొస్తున్నాయి. ఒంటి నిండా బట్ట కట్టకుంటే నీ సొమ్మేం పోయింది?...)

'థాంక్స్. సర్!'

×× ×× ××

'సర్!' (ముసలి పీనుగా.)

'చెప్పు, డైజీ!'

'నాకు నాలుగు రోజులు సీ యల్ కావాలి.' (హర్జంటు. తప్పనిసరిగా కావాలి. నువ్వు ఇవ్వనన్నా కావాలి.)

'ఎందుకు?'

'మా నాన్నగార్ని చూడ్డానికి.' (అది నీ కనవసరం. సీ యల్ నా హక్కు. ప్రియుణ్ణి చూడ్డాని కెళ్ళాలి. పెళ్ళి సంగతి త్వరత్వరగా తేల్చాలి.)

'నువ్వు లేకపోతే ఆఫీసు పనులన్నీ స్థంభించిపోతాయి.'

'మరెలా, సార్.' (నే న్లేకపోతే నీ బుఱ్ఱ తిరిగిపోతుంది. నాకు తెలుసు...నీ తోడేలు చూపులూ, ఫైలు మార్చేటప్పుడు వ్రేళ్ళు తగిలించడం. తేప వెధవా! నీ సంగతి నాకు తెలుసు. ఓర్చుకుంటున్నాను. అంతే.)

'రెండు రోజుల్లో వెళ్ళి త్వరగా వచ్చెయ్యి.'

'అలాగే, సార్' (వెళ్ళేం తరవాత చూసుకోవచ్చు. ఆ తరవాత నువ్వే చచ్చినట్టు పొడిగిస్తావు. పాడు మొహం. నువ్వూ. ఫైలుతో బాచి మొహాన కొట్టాలనిపిస్తోంది.)

'వీరన్నా!'

'సార్!'...(ఇంత సేపూ దాన్ని చూస్తూ కంటి దురద తీర్చుకున్నావు కదా! అప్పుడే ఏమొచ్చింది?)

'గుమస్తా గుర్నాధాన్ని పిలువు.'

'వస్తున్నా. సార్.' (మరి కా సేపు దాని కళ్ళల్లోకి వెధవ చూపులు చూస్తూ కూర్చోలేకపోయావా! ఇక మమ్మల్ని చంపుతావు.)

'ఇదేమిటోయ్. ఈ కాగితంమీద మేనేజర్ అన్న చోట రేజర్ అని రాశావు?'

'పొరపాటయింది. సార్.' (అది తమ ముద్దు పేరు, స్వామీ. మే మంతా అలాగే స్మరించుకుంటాం. ఆలోచిస్తూ ఆ మాటే రాశాను కాబోలు...)

'మరోసారి ఇలా జరిగితే పనిష్మెంటు ఇవ్వాల్సి ఉంటుంది.'

'సార్.' (తోలు తీ సేస్తాం...మాకు యూనియన్లున్నాయ్. కోర్టు లున్నాయ్. నీలాటి తోడేలుగాళ్ళు...)

'ఇకముందు జాగ్రత్త.'

'రెండు రోజుల సియ్యల్ కావాలి, సార్' (ఇస్తావా? ఛస్తావా?)

'అబ్బే. బోలెడు పనుంది. దగ్గర్లో యిన్స్పెక్షనుంది.'

'మీ రలా అంటే ఎలా, సార్' (దాని కెలా ఇచ్చావు. సియ్యల్ అడగడాని కొచ్చేటప్పుడు చీర కట్టుకొని రావాలిక...)

'వీల్లేదోయ్.'

'ఎలాగైనా కావాలి, సార్. ఇవి చేతులు కావు.' (సీ య్యల్ నీ జేబులోంచి ఇవ్వవు. నా ఎకౌంటులోంచి ఇస్తావు. నువ్వు ఇడియట్‌వి. తోడేలు చూపులు గాడివి. లంచాల నాంచారయ్యవి. పిసినారి పీనుగవి. ఇవ్వకపోతే తన్నగలను. అంట్ల వెధవా.)

×× ×× ××

ఇవి చాలా కొద్ది ఉదాహరణలు మాత్రమే!

హిపోక్రసీ సంఘజీవనాన్ని సుగమం చేస్తుంది. మనిషి మనుగడని నవ్వులతో నింపుతుంది.

టెలీపతీ బహుళ ప్రచారం పొంది ఇంటింటికీ, వంటింటికీ ప్రాకి...ఈ విధంగా బ్రాకెట్లో ఎవర్ని ఉద్దేశించిన ఆలోచన్లు వారికే తెలిస్తే ఎలా ఉంటుంది? ప్రపంచం ఏమవుతుంది?...